# ఇంటింటా బోనం పాట రిలీజ్



ఇంటింటా బోనం మురిసె తెలంగాణ పాటను రిలీజ్ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : 'ఇంటింటా బోనం మురిసె తెలంగాణం పాట' సోమవారం సాయంత్రం మెదక్ కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ బోనం పాటను రిలీజ్ చేశారని లిరిక్స్ రైటర్, డైరెక్టర్ మదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగర్ శ్రీవిద్యా మలహరి, యాక్టర్ రిషిత పర్సురామ్ రత్న పాల్గొన్నారు. ఈ పాట చాలా బాగుందని లిరిక్స్, సింగర్, మ్యూజిక్ డాప్, కొరియోగ్రాఫర్ డాన్సర్స్ అందరూ చాలా మంచిగా యాక్టింగ్ చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు.

## బాధితులకు రూ.7లక్షల నష్టపరిహారం అందజేత

బాధితులకు చెక్‌ను అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జూలై 9 : మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులో బాధితులకు రూ.7లక్షల చెక్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అందజేశారు. మంగళవారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కేసులో ఇరుపక్షాల వారు రాజీ కుదుర్చుకోవడంతో యూనివర్సల్ సాంపూ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బాధితులకు నష్ట పరిహారం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పోచయ్య, బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న కిరాణ దుకాణ యజమానికి జరిమాన విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 9 : జిల్లా కేంద్రంలోని టిఫిన్ సెంటర్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, స్వీట్ హౌస్ తదితర తినుబండారాల దుకాణాల్లో మున్సిపల్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అపరిశుభ్రమైన, ఫ్రిడ్జిల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీన పర్చుకొని రూ.15 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది శ్రీనివాస్, శేఖర్, కిరణ్, లక్ష్మణ్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొక్క నాటుతున్న మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్

నిజాంపేట, జూలై 9 : ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ తెలిపారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిజాంపేటలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నార్లపూర్ మాజీ ఎంపీటీసీ, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, సంజీవ్, నాయకులు బాబు, రమేశ్, సిద్ధిరాంరెడ్డి, రాజిరెడ్డి, జాల పోచయ్య, భానుప్రసాద్, స్వామి, తిరుపతి, గ్రామస్తులు వెంకటేశం, శివకుమార్ పాల్గొన్నారు.

## బీజేవైఎం మండలాధ్యక్షుడిగా శివశంకర్

శివశంకర్‌కు నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్

చిలిపిచెడ్, జూలై 9 : బీజేవైఎం మండలాధ్యక్షుడిగా రాందాస్‌గూడకు చెందిన కుర్మ శివశంకర్‌ను, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా చిలిపిచెడ్‌కు చెందిన చాకలి రామకృష్ణను నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారికి నియామకపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు చంద్రారెడ్డి, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ఏబీవీపీ ధ్యేయం

ఏబీవీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, జూలై 9 : విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది ఏబీవీపీ మాత్రమే అని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మెదక్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాందాస్ చౌరస్తాలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, వర్గ, వర్ణాలకు అతీతంగా విద్యార్థులందరి నడుమ వారధిగా విద్యార్థి పరిషత్ పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శశి, భాను తదితరులు పాల్గొన్నారు.

### రామాయంపేటలో..

రామాయంపేట, జూలై 9 : పట్టణంలోని అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకులు ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. అనంతరం వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ప్రశాంత్, నాయకుడు ప్రణయ్ సంపత్, వంశీ, మధు దీక్షిత్, మహేశ్, భాణు, సతీశ్, దేవదాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

# సర్కారు దవాఖానల్లో వైద్యులేరీ..!

- జిల్లాలో 46 డాక్టర్ పోస్టులు ఖాళీ
- గ్రామీణులకు అందని వైద్య సేవలు

మెదక్‌లోని జిల్లా కేంద్ర దవాఖాన

మెదక్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వైద్య విధాన పరిషత్ దవాఖానల్లో డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, కౌడిపల్లి, రామాయంపేట దవాఖానల్లో డాక్టర్ల కొరత ఉంది. మొత్తం 90 మంది డాక్టర్లు ప్రజలకు వైద్య సేవలందించాల్సి ఉండగా, 44 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 46 డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దవాఖానల్లో డాక్టర్లు లేకపోవడంతో నర్సులే వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కో దవాఖానలో ప్రతి రోజూ వందల మందికి సేవలు అందించాల్సి ఉంది. వైద్యులు లేకపోవడంతో రోగులకు సేవలు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి.

### అరకొరగానే ప్రభుత్వ వైద్యం..

వర్షాకాలం సీజన్ వస్తే చాలు ప్రజలు రోగాల బారిన పడుతారు. నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందడం, అపరిశుభ్రత తదితర కారణాలతో వ్యాధులు సంక్రమిస్తుంటాయి. ఈ తరుణంలో పల్లె ప్రజలు మంచాన పడక ముందే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని, మారుమూల ప్రాంతాల్లోనూ మెరుగైన సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు. ప్రభుత్వ వైద్యం అరకొరగానే ఉండడంతో కొందరు వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ దవాఖానలకు వెళ్తున్నారు.

### రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

జిల్లాలో 46 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, కౌడిపల్లి, రామాయంపేట దవాఖానల్లో డాక్టర్ల కొరత ఉంది. ఉన్న డాక్టర్లతో 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

**- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, జిల్లా కేంద్ర దవాఖాన**

## బాలిక మృతి.. ఏడుగురికి జైలుశిక్ష

వెల్దుర్తి, జూలై 9 : వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీల గ్రామానికి చెందిన బాలిక పావని మృతి కేసులో ఇద్దరు మహిళలు, వారిని కొట్టిన మరో ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై నవత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. శేరీల గ్రామానికి చెందిన కౌడె శ్రీనివాస్, యాదమ్మ దంపతుల కుమార్తె కౌడె పావని (18)ని నానమ్మ, మేనత్తలు తీవ్రంగా దూర్భాషలాడడంతో తీవ్ర మనస్తాపానికి గురైన పావని మే 22న ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో పావని మృతికి కారణమైన నానమ్మ, మేనత్తలను మరో ఐదుగురు కుటుంబసభ్యులు కొట్టారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేయగా, మంగళవారం పావని మృతికి కారణమైన ఇద్దరు మహిళలతో పాటు వారిని కొట్టిన మరో ఐదుగురికి మెదక్ కోర్టు జైలు శిక్ష విధించడంతో ఏడుగురిని రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

## సేంద్రియ కర్బనంతో అధిక దిగుబడి

జీలుగ క్షేత్రాన్ని సందర్శించిన ఏవో రాజ్‌నారాయణ

రామాయంపేట, జూలై 9 : సేంద్రియ కర్బనంతో పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కాట్రియాల గ్రామంలోని రైతు జీలుగ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు తమ పంట చేనులో కచ్చితంగా జీలుగ విత్తనాలను వేయాలన్నారు. జీలుగ విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

## ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్లీడర్‌గా సుధాకర్

నర్సాపూర్, జూలై 9 : నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్ (ఏజీపీ)గా సుధాకర్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుధాకర్ నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

మెదక్, జూలై 9 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం ఆమె హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వన మహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు, వానకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారం, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై సమీక్షించారు.

### మొక్కలు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలి

వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్క్‌ల్లో మొక్కల పెంపకం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదుక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి చివరి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. విత్తనాల లభ్యత అంశాన్ని కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లా స్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డవో జై చంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొలంగట్టు హద్దులు దాటారని కర్రలతో దాడి

- ఆగ్రహంతో ఇరువర్గాల మధ్య వివాదం
- క్షణికావేశంతో కట్టేసి కర్రతో చితకబాది..
- మరొకరి తల పగిలి.. మెదక్ ఏరియా దవాఖానలో చికిత్స

ఘర్షణలో తలకు గాయాలై రక్తపుమరకలతో పడి ఉన్న తుంగని మల్లయ్య

ముక్కిరె మల్లయ్య కొడుకు నర్సింహులును పైపునకు కట్టేసి కొట్టిన దృశ్యం

కొల్చారం, జూలై 9 : పొలం గట్టు హద్దులు దాటారని ఇరువురు రైతులు కర్రలతో దాడి చేసుకున్న ఘటన మండల పరిధిలోని సంగాయిపేటలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన తుంగని మల్లయ్య పొలంలోకి ముక్కిర మల్లయ్య ఒడ్డు కూలింది. తుంగని మల్లయ్య, ముక్కిరె మల్లయ్య హద్దులు దాటుతున్నారంటూ పరస్పరం పిడిగుద్దులతో ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న ముక్కిరె మల్లయ్య కొడుకు నర్సింహులు విషయం తెలుసుకొని పొలం వద్దకు వెళ్లాడు. తన తండ్రిని ముక్కిరె మల్లయ్యను తీసుకొని తన కొడుకు నర్సింహులు రంగంపేట ప్రభుత్వ దవాఖానకు వస్తున్న క్రమంలో తుంగని మల్లయ్య అతని కొడుకు బాలరాజు అడ్డగించి ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో తుంగని మల్లయ్య తలకు తీవ్ర గాయమైంది. ఆగ్రహించిన మల్లయ్య కొడుకు బాలరాజు ముక్కిరె మల్లయ్య కొడుకు నర్సింహులును రొడ్డుపక్కనె ఉన్న ఫాస్ట్‌ఫుడ్ రేకుల షెడ్డు పైపునకు తాడుతో కట్టేసి కట్టెతో కొడుతుండగా స్థానికులు జీర్ణించుకోలేక జోక్యం చేసుకొని పోలీసులకు సమాచారం అందించి విడిపించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై మహ్మద్‌గౌడ్, ఏఎస్సై తారాసింగ్ ఇరువర్గాలను పోలీస్టేషన్‌కు తరలించారు. తుంగని మల్లయ్య తలకు బలమైన గాయం కావడంతో మెదక్ ఏరియా దవాఖానకు తరలించగా తలకు 8 కుట్లు వేసి చికిత్స చేశారు. ఇరువర్గాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

శివ్వంపేట, జూలై 9 : పిల్లల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలని సీడీపీవో హేమభార్గవి తెలిపారు. నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై మంగళవారం శివ్వంపేటలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆట, పాటలతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించి విద్య నేర్పుతామని తెలిపారు. శిక్షణ తరగతులను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంతోశ, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీడీపీఓ హేమభార్గవి

## అల్పాజోలం పట్టివేత

మెదక్ అర్బన్, జూలై 9 : జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఇద్దరి నిందితుల నుంచి 160 గ్రాముల అల్పాజోలం పట్టుకున్నామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో పిల్లికోటల్ వద్ద తనిఖీ నిర్వహించగా మంగల్‌పర్తికి చెందిన శెట్టి సాయి కాంత్ గౌడ్, శెట్టిపల్లి కలన్ గ్రామానికి చెందిన నాయకి అంజగౌడ్ వద్ద 160 గ్రాముల అల్పాజోలం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అల్పాజోలంను స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు పంపామన్నారు.

## అంగన్‌వాడీ టీచర్‌ను నియమించాలి

శివ్వంపేట, జులై 9 : మండల పరిధిలోని అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌ను నియమించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. గత రెండేండ్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

చేగుంట, జూలై 9 : చేగుంట జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేసి బదిలీపై వెళ్తున్న చక్రధర్‌శర్మ, లలిత, శంకర్‌సింగ్‌రాథోడ్, ఈశ్వరయ్యలను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో చల్లా లక్ష్మణ్, మనోహర్‌రావు, వెంకటేశ్, రాజేశ్వర్, సురేందర్, రాధ, రేఖ, సరస్వతి, రమ, శ్రీవాణి, భవాని, రమాదేవి, సుధాకర్‌రెడ్డి, రఘుపతి, సిఆర్పి రమేశ్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బోనాల ఊరేగింపు

రేణుకాఎల్లమ్మకు బోనాల ఊరేగింపుతో మహిళలు

వెల్దుర్తి, జూలై 9 : ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో భక్తులు రేణుకాఎల్లమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రేణుకాఎల్లమ్మ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం డీజే పాటలు, డప్పుచప్పుళ్లతో పటాకులు కాలుస్తూ, శివసత్తుల శిగాలు, పోతరాజుల విన్యాసాలు, యువతీయువకుల కేరింతల నడుమ ఇంటింటి నుంచి భక్తులు, మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉత్సవాల్లో రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుహాసినిరెడ్డి, మహేశ్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మనోహర్

చేగుంట, జూలై 9: గ్రామాల్లో ప్రతి ఒక్కరరూ ఆరోగ్యంగా ఉండాలని చేగుంట ఆయుష్ డాక్టర్ మనోహర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కర్నాల్‌పల్లిలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలోని రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సంపతి, ఏఎన్ఎం రూప, ఆశ కార్యకర్తలు లావణ్య, శ్యామల, యాదమ్మ, మాజీ ఉప సర్పంచ్ భూపతి, వార్డు సభ్యులు అంజిరెడ్డి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

జైపాల్‌రెడ్డి(ఫైల్)

చేగుంట, జూలై 9 : మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాలు.. తూప్రాన్ మండల పరిధిలోని నాగులపల్లికి చెందిన జైపాల్‌రెడ్డి (45), బీహార్‌కు చెందిన శంభు (32)తో కలిసి మంగళవారం తన ద్విచక్ర వాహనంపై వెల్దుర్తి మండలంలోని రామంతాపూర్‌కు వ్యవసాయ కూలీ కోసం వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో జైపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శంభును హైదరాబాద్‌లోని దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జైపాల్‌రెడ్డికి భార్య లావణ్య, కుమారుడు సాకేత్‌రెడ్డి, కూతురు అమూల్య ఉన్నారని ఎస్సై బాల్‌రాజ్ తెలిపారు.

## ఆన్‌లైన్ నమోదుకు రైతులు సహకరించాలి

రామాయంపేట శివారులో పంటచేను వద్దే వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో రాజు

రామాయంపేట, జూలై 9 : ఆన్‌లైన్‌లో పంటల వివరాలు నమోదు చేసేందుకు రైతులు సహకరించాలని రామాయంపేట ఏఈవో రాజు నాయక్ తెలిపారు. మంగళవారం రామాయంపేట పట్టణ శివారులో పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వానకాలంలో రైతులు తమ పంట పొలాల్లో ఏ పంటలు సాగు చేశారో అక్కడికి చేరుకుని తమకు వివరాలు వెల్లడించాలన్నారు. పంట చేను వద్ద నుంచే ఆన్‌లైన్‌లో పంటల వివరాలు నమోదు చేస్తామన్నారు.

## ఇంటింటా జల్‌జీవన్ సర్వే

చిలిపిచెడ్, జూలై 9 : మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో మంగళవారం జల్‌జీవన్ మిషన్ సిబ్బందితో కలిసి తాగునీటిపై ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జల్ జీవన్ మిషన్ సర్వేయర్ సాయబ్ మాట్లాడుతూ.. తాగు నీటి నమూనాలను సేకరించి నీటిని పరిశీలించామన్నారు. సేకరించిన నీటి నమూనాల్లో నీటి నాణ్యత, కోర్లిన్ తదితర వాటిని పరిశీలించారు. గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛమైన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అన్వేశ్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ సురేశ్, గ్రామ కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, జల్‌జీవన్ మిషన్ సిబ్బంది గణేశ్, కార్మికులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 9 : జిల్లా కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌సాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొండల్ రెడ్డి మాట్లాడుతూ.. వానకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలు శుభ్రపర్చాలని, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫోరం సభ్యులు ఆనందం, నాగభూషణం, జీవరత్నం, బాలేశ్వర్‌గౌడ్, నరసింహ, దయాసాగర్, నాగరాజు తదితరులు ఉన్నారు.

## నీటి నిల్వలతోనే దోమల వృద్ధి

రామాయంపేట, జూలై 9 : నీటినిల్వలతోనే దోమలు వృద్ధి చెంది అనారోగ్యాల బారిన పడుతామని వైద్య సిబ్బంది, గ్రామ కార్యదర్శి పద్మ గ్రామస్తులకు తెలిపారు. మంగళవారం గ్రామంలోని వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లతో తిరిగి కుళాయిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. అనంతరం గ్రామస్తులకు నీటి నిల్వలపై అవగాహన కల్పించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★Computer Teachers Wanted immediately, Gajwel GDR & St. Mary's School. B.Com., B.Sc., & B.Tech., Candidates. Call: 9059627376.
NT-97860

CHANGE OF NAME

★I, MOHAMMED MANSOOR ALI, S/o. Mohammed Sayeb Ali (New name), Previously Called MANSOOR ALI, S/o. Sayeb Ali (Old Name), R/o. H.No. 12-3-322/1, Khadarpura, Siddipet Town & (Urban), Siddipet Dist., T.S., have Changed My Name from MANSOOR ALI, S/o. Sayeb Ali to MOHAMMED MANSOOR ALI, S/o. Mohammed Sayeb Ali.
NT-663

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.